క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మన్యుసూక్త హోమం



ఆంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: మెయిన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో పాల్గుణ పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. నరఘోష,శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి కోసం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బల్లిగిరి వెంకన్నకు విశేష అభిషేకాలు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి విశేష అర్చనలు చేపట్టారు. అభిషేకాలు జరుగుతున్న సమయంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం స్వామి వారిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శివాసు

సీతమ్మధార: ఇంట్లో గొడవపడి పశ్చిమ బెంగాల్‌లోని బహిర్గచ్చి గ్రామానికి చెందిన బాలిక సంగీత బిస్వాస్ (17)విశాఖ రైల్వే స్టేషన్లో ఉంటుంది. ఈ నెల 8వ తేదీన రైల్వే పోలీసులకు పట్టుబడింది. ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మహిళా షెల్టర్‌లో వసతి కల్పించారు. వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలిక తల్లిదండ్రులను వైజాగ్ రప్పించి సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా అప్పగించినందుకు బాలిక తల్లిదండ్రులు దేబసిస్ బిశ్వాస్ ఏయూటీడీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అనకాపల్లి నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఈవోగా వెంపలి



రాంబాబు

మహారాణిపేట: అనకాపల్లిలోని శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సింహాచలం దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వెంపలి రాంబాబు నియమితులయ్యారు. శ్రీ కనక మహాలక్ష్మి ఆలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రాంబాబును ఇటీవల సింహాచలం దేవస్థానం అసిస్టెంట్ కార్యనిర్వహణాధికారి (ఏఈవో)గా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి సహాయ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా నియమించారు. ప్రస్తుతం నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇన్చార్జి ఈవోగా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎన్.సుజాత పని చేస్తున్నారు. శనివారం వెంపలి రాంబాబు ఈవోగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

పడిపోతున్నా.. పట్టించుకోరా..?



పడిపోతున్న వాహన చోదకులకు సాయపడుతున్న స్థానికులు





కాంట్రాక్టర్ కక్కుర్తి, అధికారుల నిర్లక్ష్యం వెరసి వాహన చోదకుల్ని ఇక్కట్ల పాల్జేస్తున్నాయి. కల్వర్టు పనుల్లో నాణ్యత కొరవడి, నాలుగు మాసాల్లోనే కాంక్రీట్ పెక్కులు పైకి తేలాయి. దీంతో ఈ కల్వర్టు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తరచూ జారిపడి, గాయాలపాలవుతున్నారు. జీవీఎంసీ యంత్రాంగానికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

అల్లిపురం: తరచూ వాహనదారులు జారిపడిపోతున్నా.. పట్టించుకోరా.. అంటూ అల్లిపురం గోవింద్ రోడ్డు, సాయిబాబావీధి ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. జీవీఎంసీ కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై పనుల్లో నాణ్యతకు తిలోదకాలివ్వడం వాహన చోదకులకు, పాదచారులకు శాపంగా మారింది. గోవింద్‌రోడ్డు, సాయిబాబావీధికి వెళ్లే మలుపు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

నాలుగు మాసాలకే..

నాలుగు నెలల క్రితమే ఈ ప్రాంతంలో కల్వర్టు పనులు చేపట్టారు. పనుల్లో నాణ్యత లోపంతో కాంక్రీట్ నుంచి కంకర పిక్కలు, ఇసుక పైకి తేలిపోయాయి. దీంతో మలుపులో వాహన చోదకులు తరచూ స్కిడ్ అవుతున్నారు. చిన్నచిన్న గాయాలతో కొందరు, కాళ్లు, చేతులు విరిగి కొందరు ఆస్పత్రి పాలవుతున్నారు. రోజుకు కనీసం ఇద్దరు ముగ్గురు వాహన చోదకులు జారి పడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఇంత నాసిరకంగా చేపట్టిన కల్వర్టు కూలిపోతే, ఆ సమయంలో జరిగే ప్రమాదాన్ని ఊహించుకుంటేనే భయమేస్తోందని వాపోతున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేసినా..

పలుమార్లు జీవీఎంసీ సిబ్బందికి, అధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితి మారలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జారిపడ్డ వాహనదారుల పరిస్థితిని కళ్లకు కట్టినట్లు మొబైల్ ఫోన్లతో ఫొటోలు తీసి, చూపించినా అధికారులు పట్టించుకోవట్లేదని ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ద్విచక్రవాహనాలతో పాటు ఆటోలు కూడా తిరగబడిపోతున్నాయని, ఎవరి ప్రాణాలూ పోక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కల్వర్టుపై వెళ్లాలంటే భయమేస్తోంది



కల్వర్టుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయమేస్తోంది. స్థానికంగా ఉండటంతో నిత్యం ఏదో ఒక ప్రమాదమం జరుగుతోంది. మా కళ్ల ముందే వాహన చోదకులు జారి పడుతున్నారు. నాలుగు నెలలుగా నాకు తెలిసి సుమారు 25 మందికి పైగా జారి పడ్డారు. ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చూస్తే బాధేస్తుంది. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి.

– ఆనంద్, స్థానికుడు, గోవింద్‌రోడ్డు

బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి



ఈ కల్వర్టు వద్ద వాహనం నడపాలంటే భయమేస్తోంది. ఎంత జాగ్రత్తగా వెళ్తున్నా బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి. దగ్గరున్నవారు వెంటనే స్పందించి, సాయం చేస్తున్నారు. చీకటి పడితే పరిస్థితి మరీ దారుణం. చిన్న చిన్న కంకర పిక్కలు తేలిపోవటంతో టైర్లు స్కిడ్ అవుతున్నాయి. నా మాదిరే చాలా మంది జారిపడ్డారు. నాలుగు మాసాల్లోనే కల్వర్టు ఇంత దారుణంగా మారడానికి అధికారుల తీరే కారణం.

– సూరిశెట్టి సత్యనారాయణ, వెంకటేశ్వరమెట్ట

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

హోలీ.. ఆనంద కేళి



డాబాగార్డెన్స్ నారాయణవీధిలో మార్వాడీల హోలీ సందడి



హోలీ ఆనందంలో స్వామి వివేకానంద సంస్థ వృద్ధులు



వెంకటేశ్వరమెట్టపై హోలీ సంబరాల్లో యువకుల కేరింతలు

డాబాగార్డెన్స్: పాత నగరంలో యువత కేరింతల నడుమ హోలీ పండగ సందడిగా జరిగింది. మార్వాడీలు వారి సాంప్రదాయం ప్రకారం హోలీ పండగను ఘనంగా నిర్వహిస్తే, స్థానిక యువత రంగుల్లో మునిగి తేలారు. ఉదయం 6 గంటల నుంచే హోలీ సందడి నెలకొంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు హోలీ పండగలో భాగస్వాములయ్యారు. యువత రంగులు పూసుకుంటూ.. కోడిగుడ్లు, టమాటాలు కొట్టుకుంటూ హోలీకి మరిన్ని వన్నెలద్దారు. మధ్యాహ్నం వరకు నగర వీధుల్లో సందడి చేసిన యువత, బీచ్‌లో స్నానాలకు దారితీశారు. నియోజకవర్గ పరిధి సూర్యాబాగ్, స్ప్రింగ్‌రోడ్డు, పూర్ణామార్కెట్, అల్లిపురం, జగదాంబ ఏరియా, మహారాణిపేట, దిబ్బలపాలెం, డాబాగార్డెన్స్, టౌన్‌కొత్తరోడ్డు, చెంగల్రావుపేట, రెల్లివీధి, జబ్బర్‌తోట, పెయిన్‌దొరపేట, థామ్సన్ స్ట్రీట్, లక్ష్మీటాకీస్ తదితర ప్రాంతాల్లో హోలీ పండగ సందడి ఎక్కువగా కనిపించింది.

వృద్ధుల మధ్య హోలీ పండగ

వసంత పౌర్ణమి రోజున వచ్చే హోలీ పండగను వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఉన్న వృద్ధులు ఘనంగా చేసుకున్నారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్యూషన్ విద్యార్థులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఉత్తర భారతీయుల సందడి

నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తర భారతీయులు పెద్ద ఎత్తున హోలీ పండగ జరుపుకున్నారు. రంగులు జల్లుకుంటూ పరస్పరం హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం సముద్ర తీరానికి చేరుకుని జలకాలాటల్లో మునిగితేలారు.

అల్లిపురం: హోలీ సందర్భంగా ఉదయం నుంచి యువత, చిన్నారులు రోడ్డుపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అల్లిపురం, బంగారుమెట్ట, కుమ్మరవీధి, వెంకటేశ్వరమెట్ట, సింహాలదేవిడి, కొబ్బరితోట, నేరెళ్లకోనేరు, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో కామదహన వేడుకలు నిర్వహించారు. బౌడారారోడ్డులో రాజస్థానీ కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతంలో హోలీ సందడి మరింత ఎక్కువగా కనిపించింది. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బీచ్‌కు వెళ్లి సముద్ర స్నానాలు ఆచరించి, పూజలు నిర్వహించారు.

రేపు శ్రీలహరి కృష్ణ అమృత్ గీతాయన్ ఆల్బమ్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: మనుజ్యోతి ఆశ్రమం వారిచే 'ఓంకార్ స్వరూప్ శ్రీలహరి కృష్ణ అమృత్ గీతాయన్' హిందీ ఆడియో ఆల్బమ్ ఈ నెల 16న గురజాడ కళాక్షేత్రంలో విడుదల చేయనున్నట్టు ఆశ్రమం ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రతినిధులు ఎస్ఎన్ ప్రసాద్, అప్పారావు మీడియాతో మాట్లాడారు. 75 ఏళ్లుగా ఒకే దేవుడు.. ఒకే దేశం, ఒకే కుటుంబం సిద్ధాంతాన్ని ఆచరిస్తూ, మనుజ్యోతి ఆశ్రమం ప్రపంచమంతటా సమావేశాలు నిర్వహించిందన్నారు. దీనిలో భాగంగానే విశాఖలోని గురుజాడ కళాక్షేత్రంలో ఆడియో ఆల్బమ్ విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక గీతాలు భగవంతుని గురించి, జ్ఞానం తెలుసుకునేందుకు, నేటి నవీన సముదాయానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఏయూ మాజీ ప్రొఫెసర్ ఆచార్య వి. బాలమోహన్‌దాస్ అధ్యక్షతన నిర్వహించనున్న ఆల్బమ్ విడుదల కార్యక్రమానికి డాక్టర్ గజల్ శ్రీనివాస్, సిక్కిం రాష్ట్ర రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకర్, శివానంద ఆశ్రమ స్వామి విష్ణు దేవానంద సరస్వతి, మధ్యప్రదేశ్‌కు చెందిన కెప్టెన్ శ్యాంసుందర్ త్రిపాఠి, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ ఉపాధ్యక్షుడు ఉపాజ్ నవరాజ, ప్రతినిధులు దేవ ఇంద్రన్, జయప్రకాష్, బాలచందర్, పైడిరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మన్యం ధీరుడు చిత్రం మరపురాని జ్ఞాపకం

చిత్రం విజయోత్సవంలోఎమ్మెల్యే గంటా

డాబాగార్డెన్స్: మన్యం ధీరుడు చిత్రం వీక్షించడం మరపురాని జ్ఞాపకమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆర్‌వీవీ మూవీస్ బ్యానర్‌పై 2024లో విడుదలైన ఆర్‌వీవీ సత్యనారాయణ నిర్మించిన మన్యం ధీరుడు సినిమాకు నరేష్ డెక్కల దర్శకత్వం వహించారని తెలిపారు. ఈ మేరకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విజయోత్సవ సంబరాలను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ పాండ్రంగిలో జన్మించిన అల్లూరి సీతారామరాజు జీవితాన్ని చిత్రంగా నిర్మించడం హర్షణీయమన్నారు. నేటి నుంచి ఓటీటీ ప్లాట్ ఫాం అమెజాన్ ప్రైమ్‌లో మన్యం ధీరుడు సినిమా ప్రదర్శన ఉంటుందన్నారు. సినీ హబ్‌గా విశాఖను మారుస్తామని, దీనిపై ఇప్పటికే కమిటీలు వేశామన్నారు. నిర్మాత, హీరో ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి నిజమైన చరిత్రను ఈ సినిమాలో ఆవిష్కరించామన్నారు. ఓటీటీలో అంతా వీక్షించి ఆదరించాలని కోరారు.

కార్యక్రమంలో ఏయూ పూర్వ ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ అధినేత కాండ్రేగుల ఆదినారాయణ, దాడి సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలు



శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్

కంచరపాలెం: క్రీస్తు ప్రభువు పట్ల భయభక్తులతో జీవనం సాగించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయ రెవరెండ్ ఫాదర్ జొన్నాడ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం వరకు పరిశుద్ధ శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు పట్ల భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సీఆర్పీ నూతన కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఆర్పీల సమస్యలపై చర్చించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడుతూ సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో మండల సీఆర్పీలు శివాజీ, ఈశ్వరరావు, రాంబాబు కీలకంగా వ్యవహరించారు.

వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ సభ్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్యాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ జోన్–1 కార్యవర్గ సమావేశం శనివారం పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ బి.సేవా నాయక్, ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.విజయ సారధి, కోశాధికారి డి.కోదండ రావు, పాల్గొని సమస్యలపై చర్చించారు. ప్రధానంగా వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని, పారా వెటర్నరీ కౌన్సిల్ పూర్తి స్థాయిలో ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఫెడరేషన్ చైర్మన్‌గా డి.కోదండరావును, అనకాపల్లి జిల్లా ఇంచార్జి చైర్మన్‌గా వెంకట లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ వైవీ ప్రసాదరావు, ఎం.రాఘవరావు, ఎం.సాగర్ బాబు, ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ

సింధియా: క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించగలమని షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి అన్నారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, సెర్వావాక్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒమెగా హాస్పిటల్ భాగస్వామ్యంతో మల్కాపురంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఇటీవల మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్న తరుణంలో ఈ నిర్ధారణ పరీక్షలు, వ్యాక్సినేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి మెడికల్ రిప్రజెంటేటివ్స్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్ తదితరులు

అల్లిపురం: మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరినీ హైలీ స్కిల్ కేటగిరిగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో మహా సభలు నిర్వహిస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన సంయుక్త కార్యదర్శి యూఎస్ రవికుమార్ తెలిపారు. జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో పలు తీర్మానాలు చేయనున్నట్టు చెప్పారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్‌కుమార్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకుడు కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్ తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ విజయ సునీత

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత పరిశీలించారు. ఉత్తరాంధ్ర పర్యటన నేపథ్యంలో విశాఖకు వచ్చిన ఆమె శుక్రవారం సాయంత్రం ఎంవీపీ రైతు బజార్‌ను తనిఖీ చేశారు. ఇటు రైతులకు, అటు వినియోగదారులు ఇబ్బందులు లేకుండా ధరలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పలువురు రైతులతో ముచ్చటించారు. రైతుల కార్డులు, డ్వాక్రా కౌంటర్లను పరిశీలించారు. రైతులు తీసుకొస్తున్న టమోటా, డ్వాక్రా రైతులు అమ్ముతున్న ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు అందిస్తున్నారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కిరణ్, ఏడీ యాసిన్, ఈవో వరహాలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాటిచెట్లపాలెం: పాలకులు ఉద్యమకారులను అక్రమ అరెస్టులు చేసి ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నరసింహనగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14న విశాఖలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శనలకు ఇచ్చిన పిలుపును అడ్డుకోడానికి స్టీల్‌ప్లాంట్, గాజువాక పోలీసులు తమ నాయకులను అరెస్టులు చేశారన్నారు. ఈ విధంగా అక్రమ అరెస్టులు చేస్తే ప్రభుత్వం తగిన విధంగా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏళ్ల తరబడి ప్రజా ఉద్యమాలు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపీలు, మంత్రులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, పవన్ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రధాని మోదీతో పోరాడాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పరుల హితమే మాస్టర్ ఈకే జీవితం

తాటిచెట్లపాలెం: పరుల హితం కోసమే మాస్టర్ ఇ.కె. నిరంతరం నిస్వార్థ సేవలు అందించారని, అదే ఆయన జీవన విధానమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ పబ్లికేషన్స్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. మాస్టర్ ఇ.కె. 41వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తాటిచెట్లపాలెంలోని సంస్కృతి సదన్‌లో ప్రత్యేక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె. దేశ, విదేశాల్లో వేలాది మందిలో సేవా దృక్పథం, ఆధ్యాత్మిక చైతన్యం కలిగించారని, ఆయన రచించిన శతాధిక గ్రంథాలు నేడు సాధకులకు మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. ముఖ్య అతిథి జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్యుత రామరాజు మాట్లాడుతూ జగద్గురు పీఠం, స్కిల్ ఇండియా సంయుక్తంగా పలు వృత్తి విద్యల్లో అనేక శిక్షణ తరగతులను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ఫలితమే నేడు వందలాది మంది పేద మహిళలు స్వయం ఉపాధిని కల్పించుకుంటున్నారన్నారు. బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 60 మంది మహిళలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. 8 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ హోమియో వైద్యాలయం నిర్వాహకురాలు డాక్టర్ అజ్జరపు సుబ్బలక్ష్మి, జగద్గురు పీఠం డైరెక్టర్ బి.ఉషారాణి, గొల్లపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా శుక్రవారం ఇద్దరు బాధితులకు రూ.2,50,000 పరిహారం అందజేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం తీసుకున్న చర్యలు ఫలితంగా ఇటీవల హి హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో చనిపోయిన వి.సంతోషి కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు, తీవ్ర గాయాల పాలైన వెంకట శశాంక్‌కు రూ.50వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు సహాయ కేంద్రం ద్వారా రూ.15 లక్షలు రోడ్డు ప్రమాదబాధితులకు అందజేసినట్టు పేర్కొన్నారు.